క్లుప్తంగా

దాలివలసలో నేడు ఉచిత వైద్యశిబిరం

కె.కోటపాడు : మండలంలో దాలివలస గ్రామంలో ఆదివారం సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి బొంతు మంగపతిరావు తెలిపారు. చెవి, ముక్కు, గొంతు వైద్యులు డాక్టర్ బండారు రామచంద్రరరావు ఈ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు పరీక్షలు జరుపుతారని తెలిపారు. విశాఖకు చెందిన ఒమేగా కేన్సర్ ఆస్పత్రి వైద్యులు కూడా ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు.

సీడీపీవోగా రాజేశ్వరి



నర్సీపట్నం : నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టులో గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఎం.రాజేశ్వరికి సీడీపీవోగా పదోన్నతి పొందారు. ప్రాజెక్టు పరిధిలో ఆమె కొంతకాలంగా సేవలు అందించారు. సీడీపీవోగా శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

రేపు ఎం.అలమండకు విద్యుత్ సరఫరా నిలిపివేత

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ గ్రామానికి సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 24 గంటల విద్యుత్ లైన్‌కు సంబంధించిన పనులు చేపడతామని తెలిపారు.

షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత రమణబాబు కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో నిర్మాణంలో శ్రీ షిర్డిసాయి ఆలయానికి గ్రామానికి చెందిన పుట్టా రమణబాబు, లక్ష్మి కుటుంబ సభ్యులు రూ.10వేలు నగదు అందజేశారు. ఈ నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ చాణక్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతోషిమాత భక్తుల మాలధారణ



కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయంలో మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్ : శ్రావణమాసం పురస్కరించుకుని పలువురు భక్తులు సంతోషిమాత అమ్మవారి దీక్షలు చేపట్టారు. కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయం వద్ద 18 మంది భక్తులు మాలధారణ చేశారు. తొమ్మిది రోజుల పాటు కఠిన నియమాలతో మాలాధారణలో ఉదయం, సాయంత్రం పూజలు, ఉదయం, సాయంత్రం చద్ది, మధ్యాహ్న భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కాళ్ల అమ్మతల్లినాయుడు సారథ్యంలో గత 15 సంవత్సరాలుగా ఇక్కడ అమ్మవారి మాలధారణ కార్యక్రమం జరుగుతుంది.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోండి

మాడుగుల : ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని, సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి అన్నారు. శనివారం లజయ్యపురం గిరిజన గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఇప్పటికే రూ.300 వచ్చే కరెంటు బిల్లులు రూ.600 దాటివస్తుంటే కొత్తగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో మరింత భారం పెంచడం దారుణమన్నారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేస్తే సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బులు చెల్లించి రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ మీటర్లు ఏర్పాటు చేస్తే ఇంటింటికీ బిల్లులు ఇవ్వరని, రీడింగ్ తీయరని, సమస్య వస్తే సమాధానం చెప్పేవారు ఉండరని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు కె.భవానీ పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంఈవో

రోలుగుంట : మెడికల్ లీవులో ఉన్న ఎంఈవో–2 జగ్గారావు విధుల్లో చేరారు. శుక్ర, శనివారాలు పలు పాఠశాలలు సందర్శించారు. కొండపాలెం ఎంపీపీ పాఠశాలల్లో–37 మంది, రోలుగుంట ఎంపీపీ మెయిన్ లో 56 మందికి విద్యాకిట్‌లు పంపిణీ జరిగినట్టు పరిశీలన ద్వారా తెలుసుకున్నారు. త్వరలో నిర్వహించనున్న ఎఫ్ఏ–1 పరీక్షలు నిర్వహణ, సామగ్రి సరఫరా, వినియోగానికి సంబంధించి హెచ్ఎంలకు సూచనలు చేశారు.

ఎన్నాళ్లీ ఎదురు చూపులు!

- టిడ్కో లబ్ధిదారుల దుస్థితి
- మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం మీనమేషాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన పనులతో నిలిచిపోయిన టిడ్కో గృహాలు

నర్సీపట్నం : నిరుపేదల సొంతింటి కల సాకారానికి ఏడేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. 2014 టిడిపి ప్రభుత్వంలో పేదలకు సొంత గూడు కల్పించేందుకు జీప్లస్3 విధానంలో నర్సీపట్నం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున టిడ్కో గృహాలను నిర్మించారు. టిడిపి ప్రభుత్వంలోనే గృహాలను అసంపూర్తిగా వదిలేసారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి దాదాపు పనులు పూర్తి చేసి రంగులు వేసారు. కనీస సౌకర్యాలు కల్పించే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో టిడ్కో గృహాల కల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆశించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలు కావస్తున్నా టిడ్కో గృహాల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పటం లేదు.

మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోనూ, బయపురెడ్డిపాలెం ప్రాంతాల్లో మొత్తం 2,750 ఇళ్లను నిర్మించారు. వీరిలో సింగిల్ బెడ్ రూమ్ కలిగిన 384 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి రాయితీ కల్పించి పట్టాలు ఇచ్చారు. సౌకర్యాలు లేక ఎవరూ అందులోకి వెళ్లలేదు. కనీస సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, విద్యుత్, సెప్టిక్ ట్యాంక్‌లు, వాటర్ ట్యాంక్ పనులు పూర్తి కాలేదు. గృహాలు అప్పగించకుండానే రుణాలు చెల్లించాలని బ్యాంక్ అధికారుల ఒత్తిడి చేయడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. తమ గోడు పట్టించుకుని కనీస సౌకర్యాలు కల్పించి గృహాలను అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



కె.జె.పురం 2 వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో యర్రయమ్మ



చౌడువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పీవో లలితకుమారి

మాడుగుల రూరల్: పుట్టిన గంటలో తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేష్టకరమని, మాడుగుల ఐసీడీఎస్ సీడీపీవో జి. యర్రయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా, కె.జె.పురం –2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాలు ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు బిడ్డకు మెదటి టీకాగా పనిచేస్తుందన్నారు. ఈ నెల 1 వ తేది నుంచి 7 వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకోని, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

కె.కోటపాడు : పుట్టిన చిన్నారులకు వెంటనే తల్లిపాలను అందించాలని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలితకుమారి అన్నారు. చౌడువాడ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులకు నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. తల్లిపాలలో అధికమైన ఔషధ గుణాలు ఉండడం వల్ల బిడ్డకు వచ్చే వ్యాధులను ఎదుర్కోనేందుకు అవసరమయ్యే శక్తి తల్లిపాలలోనే సమకూరుతుందని పేర్కొన్నారు. తల్లిపాలను తప్పనిసరిగా బిడ్డకు అందించి, చిన్నారులకు డబ్బా పాలను దూరం చేయాలని సూచించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన సర్పంచ్ వరలక్ష్మి, హెచ్ఎం సుజాత

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ఎ.కోడూరు సిరి స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హైస్కూల్ హెచ్ఎం ఆర్.సుజాత సమక్షంలో సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి చినకన్నబాబు, అక్కు తాత, అచ్చింనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం, కేవీపీఎస్ నాయకులు గోవింద, చిరంజీవి

రొలుగుంట: మండలంలో గల ఫ్లోరైడు గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లోను మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని బాధిత గ్రామస్తులతో కలసి సీపీఎం జిల్లా నాయకుడు కె.గోవింద, కేవీపీఎస్ నాయకుడు ఇ.చిరంజీవి డిమాండ్ చేశారు.మండలంలో ఫ్లోరైడ్ గ్రామాలుగా గుర్తించిన కె.నాయుడుపాలెం, కొవ్వూరు, నిండుగొండ, ఎన్.కొత్తూరు, కిలపర్తిపాలెం , మునిపల్లి, గొల్లపేట తదితర గ్రామాలకు జనకీరాంపురం ఏటి నుంచి నీటిని శుద్ధి చేసి పైపుల ద్వారా సరఫరా చేస్తున్నారని, అయితే మండలం పలు క్వారీల నుంచి అధిక లోడుతో లారీల రాకపోకల వల్ల తరుచూ పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు గతంలో నిర్వహించిన గ్రామసభల్లో వాటర్‌ప్లాంట్ల ఏర్పాటుపై ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు.

స్వామిత్రను వినియోగించుకోండి

చీడికాడ : త్వరలో గ్రామాల్లో నిర్వహించే స్వామిత్రా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీఓ హేమసుందరరావు అన్నారు. శనివారం స్వామిత్ర కార్యక్రమంపై పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. స్వామిత్ర సర్వే ద్వారా గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లను కొలిచి యాజమాన్య హక్కులతో పూర్తి స్థాయిలో హక్కు పత్రాలను యజమానులకు అందించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా యజమానికి ఇంటిపై పూర్తి హక్కు వస్తుందని తద్వారా యజమాని రుణాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



వడ్డాదిలో కూలీలను విచారిస్తున్న సోషల్ ఆడిట్ సిబ్బంది

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1,047 మంది జాబ్ కార్డులుండగా రోజుకు సుమారు 450 మందికిపైగా కూలీలు ఉపాధి హామీ పనులుకు హాజరవుతున్నారు. ఈ ఏడాదిలో గ్రామంలో 118 పనులు చేయగా రూ.1,36,74,824 ఖర్చు చేశారు. ఈ నిధులు సక్రమంగా ఖర్చు చేశారా...కూలీలకు చెల్లింపులు చేశారా అని శనివారం సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి తిరిగి ఆరా తీశారు. అలాగే 1,281 మంది పలు రకాల పింఛన్లు అందుకుంటున్నారు. వీరందరికీ పింఛను నగదు సక్రమంగా అందినది లేనిదీ పరిశీలన చేస్తున్నారు. 10వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించి 11వ తేదీన పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై విద్యుత్ భారం

రోలుగుంట : పేద ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లు ఏ ఇంటికి ఏర్పాటు చేయొద్దని సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి డిమాండు చేశారు. మండలంలో శనివరం ఆయన రత్నంపేట, కొంతల గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజలతో సమావేశం అయ్యారు. ప్రజలపై భారం మోపేందుకే స్మార్టు మీటర్లు పెడుతున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్టుమీటర్లు పగులగొట్టండని చెప్పిన మంత్రి లోకేష్ ఇపుడు స్మార్టు మీటర్లు పెడతామంటే ఎందుకు మాట్లాడడం లేదని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ విధానం రద్దు చేయాలని ఆయన డిమాండు చేశారు.

ధ్యానంతో చదువుపై మరింత ఏకాగ్రత



గొండుపాలెం పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ

కె.కోటపాడు : విద్యార్థి దశ నుండే ద్యానంపై అవగాహన పెంచుకోవాలని పిరమిడ్ మాస్టర్ ఒ.నాగ అప్పారావు అన్నారు. చౌడువాడ ప్రాథమిక పాఠశాల, గొండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ అందించారు. ప్రతి విద్యార్థి వారి వయసును అనుసరించి ధాన్యంలో భాగంగా శ్వాసపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. తద్వారా మంచి ఆరోగ్యం , సద్బుద్ధి కలుగుతుందని అన్నారు. ఏకాగ్రతతో చదువులో మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. రెండు పాఠశాలల్లో విద్యార్థులకు నాగ అప్పారావు భగవద్గీత పుస్తకాలను అందించారు.

ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి సారించాలి

దేవరాపల్లి : అన్నదాతలు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై దృష్టి సారించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నగదు విడుదలను పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన 45,355 మంది రైతులకు రూ.30.21 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్టు నమూనా చెక్కును రైతులకు అందజేశారు.

అన్నదాతకు ఖరీఫ్ కష్టాలు



నీటితో నారుమడిని రక్షించుకుంటున్న రైతు

గొలుగొండ: ఖరీఫ్‌లో వరి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. గత 10 రోజుల క్రితం వర్షాలు కురిస్తే అన్ని ప్రాంతాల్లో నారుమడులు వేయడం జరిగింది. తీరా మరుసటి రోజు నుండి విపరీతమైన ఎండలు ప్రారంభం అయ్యాయి. 9 రోజుల నుండి చినుక లేక రైతులు అల్లాడిపోతున్నారు. వేసవిని తలపించే విధంగా ఎండలు విపరీతంగా కాయడంతో వేసిన నారుమడులు రక్షించుకోవడం కోసం కావిళ్లతో నీటిని తీసుకువచ్చి నారుమడులు రక్షించుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో విప్పలపాలెం, దారగెడ్డ, బోరింగెడ్డ, బొడ్డేరు ప్రాంతాల్లో సుమారుగా ప్రతీ ఏటా 6వేల ఎకరాల్లో వరినాట్లు జరుగుతుంటాయి. గెడ్డల్లో నీరు కూడా ఎండిపోయిన పరిస్థితి నెలకోవడంతో రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ కష్టంగా ఉంటుందని రైతులు అంటున్నారు. సరైన వర్షాలు కురిస్తే తప్ప ఖరీఫ్‌లో నాట్లు వేసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వడ్డాదిలో మురుగు కాలువలు శుభ్రం

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో పంచాయతీ సిబ్బంది జోరుగా శానిటేషన్ పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు శనివారం తమ సిబ్బందితో వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలపై ఉన్న సిమెంట్ పలకలను తీయించి కాలువల్లో పూడిక తీయించారు. పలు వీధుల్లో చెత్తా చెదారం శుభ్రం చేయించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



మర్రిపాలెం పంచాయతీలో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

నాతవరం : గ్రామాల్లో జ్వరాల నివారణలో భాగంగా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో శనివారం సర్పంచులు ఆధ్వర్యంలో వీధులను శుభ్రం చేయడం, డ్రైనేజీలో పూడిక తొలగించే పనులు చేపట్టారు. తాగునీటి పథకాలు, కుళాయిల్లో క్లోరినేషన్ చేపట్టారు. జ్వరాలు ఉన్న గ్రామాల్లో నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేశారు.

కె.కోటపాడు : సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టినట్టు వారాడ పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని అన్నారు. వారాడలో శనివారం పారిశుధ్య పనులను పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. పారిశుధ్య సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రధాన వీధుల్లో చీపురు పట్టి చెత్తను ఊడ్చే పనుల్లో పాల్గొన్నారు.ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'బలవంతపు భూసేకరణ చేస్తే ఉద్యమిస్తాం'



భీమవరంలో రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట : ఎర్రవాయి గ్రామాల రైతుల అనుమతి లేకుండా అధికారులు, రాజకీయపార్టీ నాయకులు బలవంతపు భూ సేకరణ చేపడితే రైతుల తరపున ఉద్యమిస్తామని ఏపీ రైతు సంఘం,సీఐటీయు నాయకులు శ్రీనివాసరావు, సాంబశివరావు తెలిపారు. వీరు శనివారం ఆర్. భీమవరం, చిన భీమవరం గ్రామాల్లో పర్యటించి రైతులను కలుసుకున్నారు. పలువురు రైతులు తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు మాత్రం మాకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వలేదని, పలువురికి తప్పుడు సర్వే నంబర్లతో రికార్డులు తారుమారు చేశారని రైతు సంఘం నాయకులకు వివరించారు. ఇదే భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని మా భూములను పరిశ్రమలకు ఇవ్వబోమని ఆయా గ్రామాల రైతులు రైతు సంఘ నాయకులకు వివరించారు. దీనిపై రైతుల అభిప్రాయం తీసుకోకుండా అధికారులు బలవంతపు భూ సేకరణ చేయడానికి చూస్తే మీకు అండగా ఉంటామని రైతు సంఘ నాయకులు రైతులకు హామీ ఇచ్చారు.

'నర్సీపట్నం'కు 753 స్పౌజ్ పింఛన్లు మంజూరు



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : నర్సీపట్నం నియోజకవర్గానికి 753 భాగస్వామ్య పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గొలుగొండ 161, మాకవరపాలెం 178, నర్సీపట్నం 113, నర్సీపట్నం మున్సిపాలిటీ 98, నాతవరం 203 కొత్తగా పింఛన్లు మంజూరు చేయటం జరిగిందన్నారు. నర్సీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.43 కోట్లతో 1,08,00 భాగస్వామ్య పింఛన్లను మంజూరు చేసిందన్నారు. నియోకవర్గంలోని 753 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షలు అందజేసామన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ల రూపంలో ఆర్థిక భద్రత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఎంపీటీసీ బోళం రాంప్రసాద్. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూపుదిద్దుకుంటున్న వినాయకులు

- ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో విగ్రహాల తయారీ
- రూ.100 నుంచి రూ.30 వేల వరకు ధరల్లో విక్రయాలు



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు

మాడుగుల : మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వినాయక విగ్రహాలు తయారీ జరుగుతుంది. నాలుగేళ్లుగా ఇక్కడ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచి పాడేరు, అరకు తదితర జిల్లాలకు వందలాది విగ్రహాలు సరఫరా చేస్తున్నారు. మండలంలో కుమ్మరి కులస్తులు దసరా నుంచి శ్రీరామ నవమి వరకు ఇటుకలు తయారీకి దూర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. వర్షాకాలం రావడంతో వీరికి పని దొరికేది కాదు. ఇక్కడ వినాయక విగ్రహాల తయారీ కేంద్రం రావడంతో వర్షాకాలంలో వినాయక విగ్రహాలతో పాటు దేవీ విగ్రహాలు తయారు చేయడం వల్ల సుమారు ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 40 కుటుంబాలకు జీవనోపాధి దొరుకుతుంది. వివిధ రకాలు వాహనాలపై సిద్ధి వినాయకుడిని మలచడంతో ఎంతో ఆకట్టుకుంటున్నాయి. రూ.100 నుంచి రూ.30వేల వరకు ధరల్లో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నారు. మాడుగుల నియోజకరవ్గంలోనే గ్రామానికి 3 నుంచి 5 విగ్రహాలు వరకు ఏర్పాటు చేస్తారు. దీంతో ఒక్క మాడుగుల నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాలకు ఎగుమతి చేయడానికి సుమారు 1800 విగ్రహాలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల నుంచి వినాయక విగ్రహాల తయారీలో శిల్పులు నిమగ్నమై ఉన్నారు.

పాఠశాలల్లో ప్రతి శనివారం నో బ్యాగ్ డే



కె.కోటపాడు హైస్కూల్‌లో ఎన్నికల పోలింగ్ విధానంపై అవగాహనను కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం నోబ్యాగ్ డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి డి.వి.డి.ప్రసాద్ అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. నోబ్యాగ్ డే సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతు ప్రతి శనివారం విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధన కాకుండా సామాజిక అంశాలపై అవగాహన, పచ్చదనం, పరిశుభ్రత, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహనను కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్వారీ బాధితుల నిరసనకు కాంగ్రెస్ మద్దతు



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.కోడూరు క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆర్డీవో కార్యాలయం వద్ద బాధిత దళిత రైతులు చేపట్టిన నిరాహారదీక్షలు శనివారం నాటికి 11 రోజులకు చేరింది. అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాహుల్, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అనంత్ శిబిరానికి విచ్చేసి మద్దతు తెలియజేసారు. క్వారీ కారణంగా దళిత రైతుల భూములు పాడవుతున్నాయన్నారు. జీవనాధారం కోల్పోతారన్నారు. దళితులు 11 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు, బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బొట్టా నాగరాజు, సీపీఎం నాయకులు చిరంజీవి, బాధిత రైతులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

రావికమతం: మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పీఎం కిసాన్-అన్నదాత సఖీభవ ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాన్ని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శనివారం ప్రారంభించారు. నియోజవర్గంలో 50,338 మందికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందుతున్నారని ఎమ్మెల్యే రాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామస్వామి, కోమిటి శంకరావు, సర్పంచ్ గెంజి మంగ మోదినాయుడు పాల్గొన్నారు.